స్కెచ్

# గాయకుడికి సన్మానం

వల్లూరి కృష్ణారావు

వరదాచారి పోయాడని ఊరంతా గుప్పుమంది. ఎక్కడచూసినా, ఏ వీథికివెళ్ళినా వరదాచారిని గురించి మాట్లాడేవారే! "కర్ణాటకంలో మహా అందివేసిన చెయ్యి" అన్నారు వరదాచారి విద్యను పొగుడుతూ. తుదిపలుకులుగా జాలిని ఎంతో పొదుగుతూ "పాపం చివర రోజుల్లో మహాఅవస్థ పడ్డాడు!" చచ్చిన వాళ్ళమీద గంపెడు ప్రేమ ఈ ఊరిప్రజలకుంది. "వరదాచారివిద్యను ఒక్కరు గుర్తించలేరు" అన్నాడు రావిచెట్టు అరుగుమీదకూర్చున్న ఓ ఆసామి. ఒక్కరూ గుర్తించలేదని పోనీ తనైనా గుర్తించాడా ఇప్పటికయినా! అవును. ఈ కాస్త ముక్క వరదాచారికి వినిపించి ఉంటే ఎంత సంబర పడేవాడో! గంతులువేస్తూ, పొట్ట మాడుతున్నా, గొంతు తడి ఆరిపోయినా, పాటలు వినిపించి ఉండేవాడు. ఎదటివాడి మంచితనాన్ని, విద్యని అంగీకరించటం చేదు మందుకంటె అహితవుగా ఉంటుందిగా! వీథి అరుగుమీద భోజనంచేసి సావధానంగా కూర్చున్న ఒక ఆసామీ అంటాడు కదా: "కళకు ఇంకా రాణింపు రాలేదండి. మనం చూడం కళను గుర్తించే రోజుల్ని." అంతా కళను, దాని లోతుల్నిగురించి మాట్లాడేవారే! ఒకమాటు వరదాచారి క్లబ్బు మెంబర్లను బ్రతిమిలాడి పాట కచ్చేరీ పెట్టాడు. వరదాచారి చచ్చేలా పాడాడు రెండు గంటలు పైగా. వింటున్న జనం పాముల్లా బుర్రలాడించి వళ్లు దులుపుకొని చక్కాపోయారు. వరదాచారి సాంబయ్య టీ దుకాణంలో అరువుగా 'టీ' త్రాగిపోయాడు సాయంత్రం. ఒక్కడైనా చిన్నగవ్వ ఇవ్వలేదు సరికదా వరదాచారి మాట్లాడిన మాటలనుచూచి నవ్వుతున్నారు. తమాషా చేసుకొని పొట్టలు చేత్తోపట్టుకున్నారు వాడి పిచ్చికి. వరదాచారి సంగీతంలో పెద్ద 'రివల్యూషన్' తీసుకువస్తాట్ట! ఇప్పుడు పాడేపాట గాళ్ళందరివీ అపస్వరాలేనట! భావాన్ని ఖూనీ చేస్తున్నారట! వీడు బయలుదేరాడు సంగీతాన్ని ఉద్ధరించడానికి! కంచిగరుడసేవ పాటను వీడూ ఆక్షేపించడం! అది కాదండీ! చూడండి 'వినతో' అని దీర్ఘం తీస్తారట ..అ...వీడేమో 'వాహనో' అని తీస్తాడులాఉంది. ఇంకా చూడండి చిత్రం పైగా పెద్ద సంగీత పాండిత్యం ఉన్నట్లు షడ్జమ గ్రామాలు ఇంకా ఏవేవో గ్రామాలు అంటాడు! పైగాట వీడి సంగీతానికి ఉత్తర ఇండియావాళ్లు కళ్ళు చెమ్మచేసుకున్నారట. అమ్మ!"—ఇంకా ఏమేమో అంటూంటే వరదాచారి శ్రేయోభిలాషి ఇలా అన్నాడు. "అదేనండి వాడికర్మ గ్రహున్నది. అది మానితే గాని వాడు బాగుపడ్డు" బాగుపడే మార్గం చూపెట్టాడు పాపం!

వరదాచారి బ్రతికుండగా తనగురించి ఒక ముక్క మంచిగా వినలేదు. అనోగతి పాలయ్యాడు ఎవ్వరూ చావకూడని చావు చచ్చాడు. తన సంగీతం తనకు ఇంకా, రేపు చస్తాడనగా కూడా, ప్రతిభ తెస్తుందని కలలు కన్నాడు. ప్రపంచం అంతా తనని గుర్తించి బ్రహ్మరథం పడ్తారని భ్రమించాడు పాపం! చివరికి ఒకముక్క—సంతోషం కలిగించేది, తన బాధలను మరిపించేది—వినలేదు. వరదాచారికి ఆత్మశాంతి లేకుండా పోయాడు పాపం. బ్రతికుండగా తన బీదతనాన్నయినా లెక్కచెయ్యలేదు. వరదాచారి బాగా పాడగలడని సాదాగా అని ఉన్నా ఎంతో తృప్తిగా ప్రాణాలు విడిచిఉండేవాడేమో! ఈ ఒక్కముక్క కోసమే తన పేదతనాన్ని, ప్రజల అలక్ష్యాన్ని, ఈసడింపుని అంతగా భరించాడేమో కూడా! అది తాను వినకుండానే వెళ్ళిపోయాడు. చచ్చిన వరదాచారిని ఈవేళ ఇదే నుప్ర పొగుడుతోంది!

వరదాచారి చావునుగురించి ఎక్కువగా కలత చెందినవాడు శివంఒక్కడే. శివానికికూడా సంగీతపు పిచ్చి ఉంది. శివం వరదాచారి శిష్యుడు కాదు గాని, వరదాచారి ఎంత నికృష్టంగా బ్రతికినా

శివానికి వరదాచారంటే కాస్త గౌరవం ఉంది. కాని శివంకూడా ఎప్పుడూ వరదాచారికి శుశ్రూష చెయ్యనూలేదు, అతన్ని గురించి అంతగా పట్టించుకోనూలేదు.

దిక్కుమాలిన చావు చచ్చిన వరదాచారి కుటుంబం వీధినిబడింది. ఆదరించడానికి ఎవ్వరూ ముందుకురాలేదు. ఖర్చులేని మాటలు శివం చాలా విన్నాడు వరదాచారి సంగీతం గురించి. ఎలాగయినా దిక్కుమాలిన కుటుంబానికి ఇంత ఏదో ముట్ట చెప్పించాలని అనుకున్నాడు. "ఈ సంగీతం అలాంటిదేమో! అందరూకూడా దిక్కుమాలిన చావులే చస్తున్నారు. ఎవ్వైనా మంచిచేస్తే తన తర్వాత ఎవరయినా... అనుకున్నాడు తనలోతాను.

శివం అడగదల్చిన అందర్నీ అడిగాడు. వరదాచారిని తలుచుకునైనా ఆ కుటుంబానికి ఇంతో అంతో ఇమ్మని కోరాడు. కనీసం వరదాచారి సంగీత పాండిత్యంచూచి కాకపోయినా ఒక దిక్కులేని కుటుంబాన్ని ఆదరించడానికైనా ఇమ్మన్నాడు. ఊహు! శివం తను చేయాలనుకున్నది చేయలేకపోగా ఇంకా బాధపడే మాటలు విన్నాడు. ఒక ముసలాయిన అన్నాడు, "ఇంకా బుద్ధయినా రాలేదురా! వరదాచారి దిక్కుమాలిన చావు చచ్చాడు. నీక్కూడా అలా చావాలని ఉందేమిట్రా! ఆ సంగీతం అదీ కట్టిపెట్టి ఏదో పని చేసుకో!" అని. శివం కళ్ళ నీళ్ళు తిప్పాడు. నోట్లో గుడ్డకుక్కుకొని బయట పడ్డాడు.

వరదాచారి ఇంటివైపు నడుస్తున్నాడు. వీధి అరుగుమీద నుంచున్న ఒక ఆమె అంటోంది ఇంకో ఆవిడతో, "ఒకడు చస్తేనేగాని ఇంకొకాడి రేఖ బయట పడదు." అవతల ఆవిడ అంది, "ప్రయివేట్లన్నీ యింక వీడు కంట్రాక్టు చేస్తాడు." స్పష్టంగా విన్నాడు శివం ఆ మాటలన్నీ. బుఱ్ఱ తిరిగిపోయింది. గట్టిగా ఏడవాలని అనిపించింది. ఎదురుగా చింకిచాపమీద పడుకుని మరణయాతన పడుతున్న వరదాచారి కనబడ్డాడు.

ఇంకా కాలుతూనే ఉన్నాడు వరదాచారి. పొగల్లో వరదాచారి సంగీతం సాధకం చేస్తున్నట్లు చూశాడు శివం. వరదాచారి ఎంతో తృప్తిగా పాడుకుంటున్నాడు ఆకాశంవైపు తలఎత్తి. శివం శివం చేతులు జోడించి నమస్కరించాడు.

"వరదాచారిగారూ ఏమీ చెయ్యలేకపోయాను క్షమించండి! ఏమీ చెయ్యలేను." ప్రక్కజేబులోంచి చిల్లర మూడణాల కాణీ తీసి ఆ మండుతున్న మంటలో వదిలాడు. ముష్టెత్తయినా కానుకగా మూడణాలకాణీ అయినా బహూకరించాడు శివం దిక్కుమాలిన చావు చచ్చిన వరదాచారి గౌరవార్థం.

"రోజులు మారాయి"-ఎవరికి?

# సంక్షేమరాజ్యంలో సువార్తలు

"సత్యం"

ఆఫీసరు యింకా రాలేదు. రమారమి పదిన్నర దాటింది. నేను ఆఫీసు గుమ్మమెక్కేటప్పటికి వరాండాలో తచ్చాడుతూన్న ఒక వ్యక్తి నన్ను చూసి చిరునవ్వుతో పలకరించాడు. ఆ నవ్వులో ఆనందం కాని సంతృప్తికాని లేదు. ఏదో తన కష్టాలు చెప్పుకుందామనో, నా సహాయం తనకి కావలసివచ్చి సిఫార్సు చేయవలెననో, ఆశతో చూస్తున్నాడు. ఆ పేలవమైన నవ్వులో నిరాశ తొంగిచూస్తున్నది. అతను నాలుగురోజులుగా ఆఫీసుకి రావడం, నిరాశతో క్రుంగిపోయి కిటికీ దగ్గరకివచ్చి పలకరించబోయి ఆ ప్రయత్నం విరమించుకొని విచారంతో తలదించుకొని పోతూండడం గమనిస్తూనే వున్నాను. అతనొక చదువు సంస్కారంలేని అమాయకుడని తోచక తప్పదు. అతను చూచే ఆ చూపులే ఆ అమాయక హృదయంలోని బాధను వ్యక్తం చేస్తున్నాయి.

"ఏం నాయుడుగారూ! మీపని పూర్తి కాలేదూ? పాపం నాలుగురోజులుగా వస్తున్నట్టు